కథలు :

# పురివిప్పిన కర్తవ్యం

జయధీర్ తిరుమలరావు

రాత్రి సగం వయస్సు దాటిపోయింది. ట్రక్కుల్లో కుక్కిన పేనుల్లా ఉన్న సి.ఆర్.పి.లు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. వాళ్ళగుండెల్లో నక్కిన ఆలోచనల్లాగా భయం భయంగా సాగుతున్నాయి ట్రక్కులు.

వాళ్ళలో ఎందరో మూడేళ్ళక్రితం భార్యాబిడ్డల్ని చూసినవాళ్ళు, మూడునాళ్ళ నుండీ నిద్రముఖం చూడనోచనివాళ్ళు. తమ బ్రతుకుల్లో తీపి ఎరగకున్నా. ప్రతి కడంపై తీపిపోనివాళ్ళు.

అలవాటుప్రకారం చేతుల తుపాకుల్ని బిగించిపట్టుకున్నా, ఉన్నపాటున వారి వెన్నెముకల్లో ఏదోభయం పోటుపొడుస్తూనేవుంది. అప్పుడు కునికిపాట్లు పడుతున్న వాళ్ళెవరూ లేరు. ఉండి ఉండి ఉలికిపాట్లు పడుతున్నవాళ్ళు తప్ప.

వాళ్ళకుతెల్సు తామెదుర్కోబోతున్న నక్సలైట్లు కేవలం మనుష్యులేనని, కాని వాళ్ళకిదీతెలుసు వాళ్ళకు భార్యాబిడ్డలు వున్నా లేకున్నా, ఆ బంధాలు తెంచుకొని సంఘంలోని అసమానతల్ని రూపుమాపటానికి పోరాడుతున్నారని, తామేమో బాధ్యతా బంధితులమని, పొట్టగడవటం కోసం ఈ వృత్తిని ఆశ్రయించిన వాళ్ళమని, ప్రభుత్వపుఅండ, ఆయుధబలం తమ వెనుకవున్నా తమకు ఆ నక్సలైట్లకున్న తెగింపులేదన్న సంగతి వాళ్ళకు తెలుసు.

తమ ఆ బలహీనతను వాళ్ళు, "ఆ! ఆ నక్సలైట్లు చస్తే ఏడ్చేవారెవరున్నారు లెద్దూ!" అని సరిపెట్టుకొంటున్నారు.

ఒక్కొక్కరి ఆలోచనలు పరి పరి విధాలుగా పరిభ్రమిస్తున్నా, వాళ్ళందరూ ఆకాంక్షించే దొక్కటే "ఈ గండం గడిస్తేచాలు!".

వీళ్ళ ఆలోచనల్లాగానే ట్రక్కులు రహదారివిడిచి పక్కదారిపట్టాయి.

ముందు ట్రక్కు క్యాబిన్‌లో కూర్చున్న డి. యస్. పి మల్‌హోత్రా, ఇన్‌స్పెక్టర్ రంజిత్‌సింగ్, సబ్-ఇన్‌స్పెక్టరు సుదర్శన్‌లమధ్య గంభీరంగా నడచిన సలహా సంప్రదింపులు ఐపోయాయనడానికి చిహ్నంగా వాహనాలు ఆగిపోయాయి. ఎవరి ఆలోచనల్లో వారు మునిగిపోయారు.

* * *

టిక్కువెళ్తున్న గతుకులదారివల్లనేమో సబ్-ఇన్‌స్పెక్టరు సుదర్శన్ కూడ గట్టుకొన్న ధైర్యం, ఉత్సాహం రానురాను సడలిపోయ్యాయి

అతడు తాను క్రొత్తగా ఉద్యోగంలో చేరిన రోజులగురించి ఆలోచిస్తున్నాడు... అప్పుడు తన ఆదర్శాలకొరకు న్యాయరక్షణకొరకు పడేపాట్లు సుశీలకు గర్వంగా చెప్తూ ఉండేవాడు. కాని ఇప్పుడు వాటిని ఆచరించడంలో అణగారిపోతున్న తన ఉత్సాహాన్ని చూసి తానే ఆశ్చర్యపోతున్నాడు.

అతని ఆలోచనల్లోకి సుశీల ప్రవేశించింది. "సుశీల యిప్పుడేంచేస్తూంటూంది?" బహూశా, బాబును గుండెల కదుముకొని తన క్షేమంకోసం భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, నిద్రరాక పడకపై దొర్లుతుంటుంది. తానసలు ఇలాంటి సమయాల్లో సుశీలతో చెప్పి రాకూడదు. అనవసరంగా ఆమె మనశ్శాంతి కోల్పోతుందనుకుంటూనేవుంటాడు. కాని తీరా సమయానికి చెప్పకుండా రాలేడు. ఏమో ఇదే ఆఖరు కలయికేమో అనిపిస్తూంది తనకు ఎప్పటికప్పుడూ—

సుశీల తనకోసం తనవాళ్ళందరిని, అష్టయిశ్వర్యాలను వదులుకొని వచ్చింది. భగవంతుడు చిన్నచూపుచూసి నాకేదన్నా కీడు జరిగితే సుశీలకు, బాబుకు దిక్కెవరు? ఏ ప్రభుత్వపు శ్రేయస్సుకొరకు ప్రాణాల్ని పణంగాపెట్టి పాటుబడుతున్నానో, ఆ ప్రభుత్వం నేనులేనిరోజు సుశీలకు, బాబుకు బాసటగా నిలుస్తుందా? ఇలా ఆలోచిస్తూంటే అతనికి ప్రతిదినం ఇలాంటి క్షణక్షణ గండాలెన్నెదుర్కోవడం కష్టం అనిపిస్తూంది.

ఆ క్షణంలో అతని ఊహలో సబ్-ఇన్‌స్పెక్టరు భాస్కర్రావ్ మెదిలాడు. అతడు తన బంధువైన ఒక మినిష్టరుగారితో రికమెండు చేయించుకొని ఇక్కడి నుండి బదిలీఅయిపోయాడు. అతని అదృష్టాన్నితలచుకొని సుదర్శన్ నిరాశాగా నిట్టూర్చాడు.

* * *

అంతవరకు నక్సలైట్లను చుట్టుముట్టడంలో తన అమూల్యాభిప్రాయాల్ని అందించిన ఇన్‌స్పెక్టరు రంజిత్‌సింగ్, ఇప్పుడు ఆ నక్సలైట్లు తమకు దొరకగూడదని కోరుకుంటున్నాడు. తన ఆధ్వర్యంలో ఎన్నోసార్లు నక్సలైట్లను ఎదుర్కోవడం జరిగింది. కాని తన దురదృష్టవశాత్తు ఎవ్వరినీ పట్టుకోలేకపోయాడు. ఇప్పుడీప్రాంతంలోనే వాళ్ళున్నట్లు తమకు నమ్మకమైన మనిషిద్వారా తెలిసింది. ఈసారి ఎలాగైనా వాళ్ళలో ఒకరినైనా పట్టుకొని 'అవార్డు' పొంది ప్రమోషను సంపాదించాలని ఆశపడ్డాడు. కాని ఈసారి డి యస్.పి. గారే స్వయంగా తమను నడిపించడంతో తనకాఅవకాశం లేకుండా పోయింది. ఇపుడు వాళ్ళను పట్టుకోవడంలో వేసిన ప్లాను మొత్తం తాను వేసిందే కాని విజయం సాధిస్తే ఆ ప్రతిభ డి,యస్.పి. గారికే దక్కుతుంది. అపుడు తన ప్రమో

షన్ మాట దేవుడెరుగు తాను అప్రయోజకుడుగా నిరూపించబడతాడు. అందుకే అతడు అలా జరగకుండా చూడమని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాడు.

* * *

ట్రక్కును చెట్లచాటున ఆపించి తన పటాలంతో, కాలినడకన అడవిలోకి చొచ్చుకొనిపోతున్న డి.యస్.పి కి కొద్ది రోజులక్రితం ఆ ప్రాంతంలోనే జరిగిన సంఘటన తలచుకోగానే ఒళ్లు గగుర్పొడిచింది. దగ్గరలోనున్న తిమ్మాపురంలో పట్టపగలు మిట్ట మధ్యాహ్నంఊరిబయట మాటుగాసి ఊరిదొర వెంగళరాయుడిని ముక్కలుముక్కలుగా నరికిపోయారట. అసలు వీళ్ళ కెంతగుండె. తన పటాలం ఎప్పుడూ గస్తీ తిరుగుతూనే వుంటోంది. ఎవడూ కన్పడడు. కాని ప్రతిరోజూ తెల్లవారేటప్పటికి ఏదో వార్త వస్తూనేవుంది. ఎట్లా బతికేది. ఏరోజు ఎవరిగతి ఎట్లావుందో. దినదిన గండం, పట్టీపట్టనట్టు ఊరుకొందామంటే పైనుండి ఘాటింపులు, మెమోలు— ఒకవైపు ప్రాణం రెండోవైపు మెమోలు. ఏం చేయాలి? ఆలోచించలేకపోయాడు. డి.యస్.పి. యస్.ఐని పిలిచి "ట్రక్కుదగ్గరకు వెళ్ళి నేనక్కడే వుంటా. కాసేపట్లో తెలవారుతోందికదా– మీరువెళ్ళి వెదకండి. రాత్రి హెచ్చరికలన్నీ గుర్తుంచుకోండి" అన్నాడు. సరేనని యస్సయి సెల్యూట్ కొట్టి బిక్కుబిక్కుమంటూ తన జవానులతో ముందుకుపోయాడు.

* * *

చెట్లనీడల్లో, పుట్టలఒడుల్లో కొన్ని శరీరాలు అలిసిన సింహాల్లా విశ్రాంతి తీసుకొంటున్నాయి. శబ్దం తానక్కడ శబ్దంచేయటానికే భయపడుతోంది. ఒకమూలనుండి బాధాకరమైన మూలుగు ఆగిఆగి మెల్లగా వినవస్తోంది అతడే దళనాయకుడు కిష్టన్న తిమ్మాపురం దొరపై జరిగిన మెరుపుదాడిలో తొంటిపై బలమైనగాయం తగిలింది. అప్పుడు పెద్ద బాధనిపించలేదుగాని రోజులు గడిచినకొద్దీ కాలువాచి, నడవనీయకుండా, చెడపోటు పెడుతోంది, బాధతోమూల్గుతూ మగతనిద్రలో వున్నాడు కామ్రేడ్ కిష్టన్న.

దూరంగా ఆకులు నలిగినచప్పుడు... అడుగులు కదిలినచప్పుడు... కిష్టన్న ఉలిక్కిపడ్డాడు, ఆ వైపు కళ్ళుచిట్లించి చూసాడు. మళ్ళీ చప్పుడు... ఆ వైపు తుపాకి గురిపెట్టాడు. సింహాలు జూలు దుల్పుకొన్నాయి. శూన్యంలోకి చెవులురిక్కించాయి. కొద్దినిమిషాల్లో సెంట్రీ చెమటలుకక్కుతూ ఒగరుస్తూవచ్చి కిష్టన్నతో "కామ్రేడ్! ప్రమాదం!! పోలీసులు మూడు వైపులనుండి చుట్టుముట్టుతున్నారు." అన్నాడు.

కిష్టన్న కనుబొమలు ముడివడ్డాయి. "తమ జాడవారికెలా తెలిసింది, ఎవడో ద్రోహి శత్రువుకు జాడతెలిపి వుంటాడు" రక్తం మరిగిపోతోంది, శరీరం ఉద్రేకంతో

ఊగిపోతోంది? ఏమిటి తక్షణ పథకం? పొదమాటునుండి చూస్తున్న కిష్టన్నకళ్ళు శత్రువుల కదలికలకోసం చీకట్లను చీల్చుతున్నాయి, చెవులు ప్రతి శబ్దాన్ని పట్టే స్తున్నాయి. ఆలోచనలు తమ రక్షణా పథకాల్ని సమీక్షిస్తున్నాయి. ఎంత ఆలోచించినా అతనికి ఒకటేమార్గం తోస్తూవుంది— "తాను రేపటి వరకు స్థావరానికి అందించవలసిన డాక్యుమెంట్లు, వస్తువులు ఎంతో విలువైనవి, ఇంకా ఆలస్యం చేశామంటే తాము చక్రబంధంలో ఇరుక్కొన్నామంటే ఇక తప్పించుకోవటం కల్ల. అందువలన వీలయి నంతత్వరలో దళాన్ని తప్పించటం తన బాధ్యత దానికొకే మార్గముంది. వీళ్ళందర్నీ చెరువు వెనకవైపునుండి లోయద్వారా స్థావరంవైపు పంపించడం వాళ్ళా లోయదిగి పోయూరా ఇక ఎవ్వరూవాళ్ళనేమీ చేయలేరు. వాళ్ళక్కడకు చేరేవరకు తానక్కడేవుండి పోలీసులను అడ్డుకోవాలి." అని నిశ్చయించుకొన్నాడు కిష్టన్న.

నాయకుని ఆజ్ఞకోసం అందరు ఎదురు చూస్తున్నారు. కిష్టన్న నెమ్మదిగా ప్రారం భించాడు "కామ్రేడ్స్, మనం అందరం చాల నిబ్బరంగా వుండాలి. ఉద్రేకం, తొందర పాటుతో నష్టాలకు గురి అవుతాం. మనం చేపట్టిన ఆశయం మహోన్నతమైనది. దీని సాధనకొరకు అవసరమైతే ప్రాణాల్ని త్యాగం చేయటం ఎంత విలువైందో, అనవ సరమైచోట ప్రాణాల్ని రక్షించుకోవడంకూడ అంతే అవసరమైంది. అంతేకాదు, మన ప్రాణా లకన్న ఎంతో విలువైన ఈ డాక్యుమెంట్లను సురక్షితంగా చేర్చవలసిన బాధ్యతకూడ మనమీదవుంది. కనుక మీరందరూ చెరువు వెనుకవైపుగా, లోయద్వారా వీలైనంత త్వరగా వెళ్ళిపోండి. నేనా ఈ తీవ్రమైన గాయంతో మీతో సమానంగా పరిగెత్త లేను. ఎలాగైనా వెనుక పడతాను. కనుక నేనిక్కడే వుండి పోలీసులు అటురాకుండా అడ్డుకొంటాను".

"లేదు కామ్రేడ్! మీరలాచేయడం మేమొప్పుకోం, మీ అమూల్యమైన నాయ కత్వం మాకెంతో అవసరం. అవసరమైతే అందరం వాళ్ళనెదుర్కొని విజయమో వీర స్వర్గమో తేల్చుకొందాం"ఆవేశంగా అన్నాడు నర్సయ్య.

"కామ్రేడ్ కిష్టన్న! నాదోసలహా" ముందుకువచ్చాడు అనంతం— "కామ్రేడ్ దుర్గ శత్రువుల కన్నుగప్పటంలో సిద్ధహస్తురాలు. అక్కకు డాక్యుమెంట్లు అప్పగిం చండి. మనలో కొందరం శత్రువును ఎదుర్కొంటాం. మీరు మిగిలినవారితో నిదానం గానే సురక్షితప్రాంతానికి చేరండి. ఎందరికో నాయకత్వం వహించవలసిన మిమ్మ ల్ను ఒంటరిగా శత్రువుముందు వదలివెళ్ళలేం— నచ్చజెప్పజూచాడు కామ్రేడ్ అనంతం.

"కామ్రేడ్స్! మనకిప్పుడు తర్జనభర్జనలు చేసే సమయంలేదు. మనలో హెచ్చు తగ్గులులేవు. ఆశయసాధనలో అందరమూ సమాన బాధ్యతాకలవారమే. నాకోసం

మీరందరూకాని, కొందరుగాని ఇక్కడ వుండటమంటే పరోక్షంగా మృత్యువుకు ఎదురు వెళ్ళడమే. శత్రువును అడ్డడానికి ఒకరు ఖచ్చితంగా కావాలికదా! నేనా మీతోసమానంగా పరిగెత్తలేను. ఏ విధంగాచూచినా నేను చెప్పినదే ఉద్యమరక్షణకు ఎక్కువ ఉపయోగం. ఏ మాత్రం ముందువెనుకలాడక మీమీ పనులు నిర్వర్తించండి— దృఢంగా అన్నాడు కామ్రేడు కిష్టన్న మాటల్లోని దృఢత్వాన్నిచూచి, మిగిలిన దళ సభ్యులందరూ స్థావరానికి చేర్చాల్సిన డాక్యుమెంట్లు, వస్తువులు భద్రంగా సంచుల్లోపెట్టుకొన్నారు. ఎంత్రిబానినకళ్ళతో త్వరలోనే కలుద్దామంటూ తమ నాయకునికి రెడ్‌శాల్యూట్ చేస్తూ చక చకా కదలిపోయారు.

"నా శాయశక్తులా ప్రయత్నించి తప్పుకోడానికి చూస్తా. అంతా మేలుజరిగితే త్వరలోనే కల్సుకొందాం" వెళ్ళవల్సిందిగా ఆదేశాలిస్తూ సాగనంపాడు కామ్రేడు కిష్టన్న.

* * *

చుట్టూ కలయచూశాడు కిష్టన్న పోలీసులు కాల్పులు జరుపుతూ కనుచూపు మేరలోకి వచ్చారు. నాటుబాంబులుతీసి విసిరేయగలిగినంత దూరం విసుర్తున్నాడు. అవివెళ్ళి పోలీసుల గుండెల్లో మారుమ్రోగుతున్నాయ్ మట్టిపెళ్ళలు, రాళ్ళు ఎగిరి పడుతున్నాయి. ఎక్కడివాళ్ళక్కడ నేలకు కరుచుకు పడుకొన్నారు. కిష్టన్న ధ్యేయం అదే వీలైనంత కాలహరణ జరగాలి. అంతేగాదు తానిక్కడ ఒక్కడే ఉన్నట్లు వాళ్ళకు తెలియకూడదు. అందుకే అతను మూడుదిక్కులా ఎడతెరిపిలేకుండా బాంబులు విసురుతున్నాడు ఒక వరుస బాంబులదాడి అయిపోయింది. అయినా భయం. ఎవరు పైకి లేవటంలేదు ముందుకుపొమ్మని బండబూతులు తిడ్తున్నాడు యస్.ఐ. లేద్దామని తల పైకెత్తగానే పోలీసువాడి నుదుటిగుండా కిష్టన్నతూటా దూసుకుపోయింది మెలికలు తిరుగుతూ పడిపోయాడు పోలీసు. పోలీసుల్లో భయం బాగాపాతుకుపోయింది. ఎవడికి వాడు నేలకు కరుచుకొని ఎటో గురిలేకుండా కాలుస్తున్నారు.

సి.ఐ. కి మండింది. ముందుకు సాగమని లేకపోతే కాల్చివేస్తానని బెదరగొడ్తున్నాడు. ముందుగొయ్యి, వెనుక నుయ్యిలాగుంది పోలీసులకు. ప్రత్యర్థి కేవలం ఒక్కడేనన్న సంగతి తెల్సుకొన్నాడు సి.ఐ. ఈ విషయం పోలీసులతోచెప్పి ప్రాణాలతో అతణ్ణి పట్టుకోవాలని ఉత్సాహపరుస్తున్నాడు. పోలీసులు చక్రబంధంగా ఏర్పడి అరచేతిలో ప్రాణాలతో గమ్యందిక్కుగా పాకసాగారు. ఇదే అదననుకొని కిష్టన్న ముందే తాను నిశ్చయించుకొన్న స్థలానికి గెంతుకుంటూ ఉరికాడు. అక్కడ చుట్టూ బండలు రక్షక కవచంలా ఏర్పడివున్నాయ్. మధ్యలో కూర్చుని, పోలీసుల మీదికి బాంబులు అన్నివైపులా విసురుతూ వీలైనంతవరకూ ఏఒక్కరిని ముందుకు రాకుండా

ఆపుతున్నాడు. కాని ఎంత ప్రయత్నించినా చెట్లచాటునుండి వలయం ముందుకు కదులుతూనేవుంది. పోలీసులు వర్షంలా గుళ్ళను కురిపిస్తున్నా, కిష్టన్న రక్షక కవచాన్ని ఛేదించలేకపోతున్నారు. కాని కిష్టన్న ఉత్సాహం పెరుగుతున్నకొద్దీ మందుగుండు తరిగిపోతోంది. బులెట్లెన్నున్నాయో చూద్దామని చేయి పక్కకుపోనిచ్చాడు. ఇంతలో బులెట్ వచ్చి చేతిని గాయపర్చింది. గాయంనుండి రక్తం జలజల కారుతోంది. ఒక పక్క నీరసం. మరోపక్క ప్రతీకారం. ఎదురుగా చూశాడు. చెట్టుచాటున నిలబడి కాలుస్తున్న సి ఐ. చేతిని గాయపర్చింది కిష్టన్న బులెట్. చేయిపట్టుకొని నేలకు ఒరిగాడు సి ఐ.

కిష్టన్నదగ్గర బులెట్లు మొత్తం ఐపోయాయి. పక్క సంచిలో మూడేమూడు బాంబులు మిగిలాయి. ఏంచెయ్యాలి? ఆలోచించాడు ఒకక్షణం. పోలీసులు మెల్లిగా కదులుతున్న సవ్వడి వినవస్తూంది. తనచుట్టూ చూశాడు. చెట్లు దట్టంగావున్నాయి. బాంబులుతీసి మూడుదిక్కులా బలంకొద్దీ విసిరాడు. పెద్ద శబ్దంచేసుకుంటూ పేలాయి మూడు బాంబులు. పోలీసులు ఎక్కడివాళ్ళక్కడ నేలపై పడుకొన్నారు. ఊపిరిబిగబట్టి చెట్లను చాటుచేసుకొంటూ ముందుకుపరిగెత్తాడు కిష్టన్న. కాసేపటికి పిరికిగుండెల్లో బిక్కుబిక్కుమంటూ ఆ స్థలాన్ని చుట్టుముట్టిన పోలీసులకు అక్కడేమీ కన్పించలేదు. యస్.ఐ. ఒక బండపైకెక్కి చుట్టూచూశాడు. దూరంలో కుంటుతోపరిగెడ్తున్న కిష్టన్న కన్పించాడు. యస్ ఐ. అందర్నీ ఆతనివెనుక పరిగెత్తి కాల్చేయమని ఆదేశాలిచ్చాడు. పారిపోతున్న కిష్టన్నను కాల్చాలని పోలీసులు ఎవరికివారు పోటీలుపడుతున్నారు. పారిపోతున్నాడంటే మందుగుండు అయిపోయుంటుందని వారి అంచనా.

తుపాకి తూటాలకందని దూరం పరిగెత్తాడు. లోయ సమీపిస్తూంది. కడుపులో ఏదో దేవుతున్నట్లవుతోంది. కాలు విపరీతమైన పోటుపెడుతోంది. కళ్ళుతిరుగుతున్నాయి. గుండెలు గొంతులోకి వస్తున్నాయి. అయినాపరిగెత్తాలి. పిరికి ప్రాణముండగా దొరకకూడదు. వేగం తగ్గిపోతోంది. లోయ అంచుకుచేరాడు. వెనుకవేపు పోలీసులు దగ్గరవుతున్నారు. ధన్ - ధన్, రెండు బులెట్లు అతని కుడికాలుపిక్కలో దిగినాయి. కుప్పలా కూలిపోయాడు. చేతులతో ముందుకు పాకబోయాడు. లోయవాలుకు కిందకు దొర్లిపోయాడు. రాళ్ళకు, మోళ్ళకు గుద్దుకుంటూ కిష్టన్న కిందకు దొర్లిపోయాడు. వెనుక పరుగెత్తకొచ్చిన పోలీసులకు కిష్టన్న దొరకకుండానే దొర్లిపోయాడు.

* * *

యస్. ఐ. అందర్నీ ముందుకుపోవాలని, ప్రాణాలతోగాని, శవాన్ని పట్టుకోవాలని పోలీసులకు ఆజ్ఞయిచ్చాడు. అయినా ఒకరూ ముందడుగు వేయటంలే.

హవల్దార్ అతనిముందుకువచ్చి చేతులుకట్టుకొని "సాబ్! ఇకపనం లోపలికి వెళ్ళడం మంచిదికాదు. ఇదంతా వాళ్ళ ఏరియా. మనం లోపలికివెళ్ళడం ప్రమాదం సాబ్" అన్నాడు నసుగుతూ.

"జీసాబ్!" నల్గురైదుగురు అతనికి వత్తాసుపలికారు పిరికిగుండెల్తో. "బద్మాష్! నాకెదురు చెపుతారా?" హవల్దార్ కెంపపగిలిపోయింది. "పదవండి అందరూ వెళ్ళి వెతకండి" గర్జించాడు సి. ఐ.

హవల్దార్ కక్కలేక మింగలేక చూస్తున్నాడు.

పోలీసులు గాలిస్తూ కొద్దిదూరం లోయలోకిదిగారు. పొదలను, పుట్టలను బాయినెట్లతో పొడిచి పొడిచి చూస్తున్నారు. ఇంతలో లోయ అంతా ఊగిపోతూ భయంకరమైన శబ్దమైంది. ముందున్న అయిదారుగురు పోలీసులు హాహాకారాలతో లోయలో కూలిపోయారు. వెనకున్నవారు వెనక్కితిరిగి కాలికొద్ది పారిపోయారు.

* * *

తూర్పునుండి సూర్యుడు ఎక్కివస్తున్నాడు. కామ్రేడ్ కిష్టన్న భౌతికకాయం ముందు కామ్రేడ్స్ శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు. విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు జరిపారు. రక్తంతో తడిసిన మట్టిని తీసుకొని, కిష్టన్నఆశయం కొనసాగిస్తామంటూ పిడిగిలి బిగించారు దళసభ్యులు. వారికళ్ళలో దీక్షను, పట్టుదల ఎరుపును చూడటానికేమో సూర్యుడు పరుగు పరుగున వస్తున్నాడు.

## ఎర్రపూల పర్వతం

తెనుగు సేత : వెన్‌పిన్

నలభైఎనిమిది సంవత్సరాలక్రితం ఛైర్మన్ మావో నాయకత్వాన "ఆకురాలు కాలపు పంటకోతల తిరుగుబాటు (Autumn Harvest uprising) జరిగింది, కార్మిక కర్షక విప్లవసైన్యం స్థాపించబడింది. చైనాయొక్క మొట్టమొదటి గ్రామీణ విప్లవ స్థావరం కియాంగ్సీ రాష్ట్రములోని చింకాంగు పర్వతాలలో నెలకొల్పబడింది. చైనా విప్లవ చరిత్రలో ఇదొక మహత్తరమైన మూలమలుపు. ఎందుకంటే- గ్రామీణ ప్రాంతాలను విముక్తి చేసుకొని పట్టణాలను చుట్టుముట్టాలనే క్రమంద్వారా సాయుధశక్తి చే రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకోవాలనే సూత్రాన్ని ఈ కాలంనుంచే చైనా విప్లవం అనుసరించింది.

ఇటీవల పీకింగులో ప్రప్రథమంగా ప్రదర్శింపబడిన ఆధునిక విప్లవాత్మక పీకింగ్ నృత్యనాటిక 'ఎర్రపూల పర్వతం'- చింకాంగు పర్వత పోరాటకాలం భూమికతో